

# మురుగు, చెత్తాచెదారం తొలగింపు

**'నమస్తే తెలంగాణ' కథనానికి స్పందించిన అధికారులు**

దోమ, ఏప్రిల్ 8 : మండలంలోని మోత్కూర్ గ్రామంలో తిష్ట వేసిన సమస్యలపై సమస్యల వలయంలో మోత్కూరు అనే శీర్షికన 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. మంగళవారం పంచాయతీ కార్యదర్శి రవీందర్‌రెడ్డి ఐదోవార్డులో రోడ్డుపై పారుతున్న మురుగుతోపాటు రోడ్డు పక్కన డబ్బాల వెనుక ఉన్న చెత్తాచెదారాన్ని సిబ్బందితో తొలగింపజేశారు. అదేవిధంగా తాగునీటి ఎద్దడిని తీర్చేందుకు మిషన్ భగీరథ ఈఈ చలమారెడ్డి, ఆర్‌డబ్ల్యూస్ ఏఈలు, వాటర్ గ్రిడ్ అధికారులు నీటి లభ్యతను పరిశీలించి గ్రామంలోని జీఎల్ ఎన్ఆర్ (పాత ట్యాంకు)కు మరమ్మతులు చేయించి నీటి సామర్థ్యాన్ని పెంచుతామన్నారు.

నమస్తే ఎఫెక్ట్

## పంట నష్టం వివరాలను ప్రభుత్వానికి అందిస్తాం..

**సాల్వీడ్ గ్రామంలో ఎండిపోయిన పంటలను పరిశీలించిన ఏఈవో**

కులకచర్ల, ఏప్రిల్ 8 : మండలంలోని సాల్వీడ్ గ్రామంలో భూగర్భజలాలు తగ్గి బోర్లు ఎండిపోతున్నాయని కర్షకుల కన్నీటి వ్యథ అనే శీర్షికన 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమైన కథనానికి మండల వ్యవసాయాధికారులు స్పందించారు. మంగళవారం మండల వ్యవసాయాధికారి వీరస్వామి ఆదేశాల మేరకు ఏఈవో బాబు సాల్వీడ్ గ్రామంలోని రైతులు రమేశ్, బస్వరాజ్‌ల వరి పంటను పరిశీలించి మాట్లాడారు. ఎండిపోయిన పంటల వివరాలను ఉన్నతాధికారులకు పంపిస్తామన్నారు.



సాల్వీడ్‌లో రైతు బస్వరాజ్‌కు చెందిన ఎండిపోయిన పంటను పరిశీలిస్తున్న ఏఈవో బాబు



# మొక్కజొన్న.. నేలపాలు

పూడూరు, ఏప్రిల్ 8 : మండలంలోని దండుగడ్డ గ్రామంలోని రైతు వడ్ల అంజయ్య ఎకరం పొలంలో సాగు చేసిన మొక్కజొన్న పంట రెండు రోజుల కిందట కురిసిన వర్షానికి పూర్తిగా నేల కొరిగింది. ఆరుగాలం కష్టపడగా.. 15 రోజుల్లో పంట చేతికొచ్చే సమయంలో పంట మొత్తం నేల పాలు కావడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. ఈ పంటను ప్రైవేట్ వ్యక్తుల నుంచి అప్పు తీసుకొచ్చి సాగు చేశానని.. దాదాపుగా 25 క్వింటాల వరకు దిగుబడి వచ్చే అవకాశం ఉండేదని..దానిని విక్రయించి అప్పు చెల్లించొచ్చునని భావించానని పేర్కొన్నాడు. ఆ వానతో బావిలోని కరెంట్ మోటర్ సైతం కాలిపోయి మరో రూ.4 వేల వరకు నష్టం వాటిల్లిందని.. చేసిన అప్పులు ఎలా తీర్చాలో.. కుటుంబాన్ని ఎలా పోషించాలో అర్థం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రభుత్వమే ఆదుకోవాలని కోరాడు.

# అప్పుడు మొక్కెటోళ్లు.. ఇప్పుడు తిడుతున్నరు..!

**కాంగ్రెస్ పాలనలో అధ్వానంగా వైద్యసేవలు**



సిటీబ్యూరో, ఏప్రిల్ 8 (నమస్తే తెలంగాణ): మార్పు కావాలంటే కాంగ్రెస్ రావాలని ఎన్నికల ముందు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పాలకులు ఇప్పుడు రాష్ట్ర ప్రజలను రాచి రంపాన పెడుతున్నారు. 16 నెలల పాలనలో నగరవాసు లు పడుతున్న వెతలు వర్ణించలేనివి. కేసీఆర్ తన పదేండ్ల పాలనలో పేద వాడి చెంతకు ఉచిత వైద్యా న్ని తీసుకొచ్చి ఆరోగ్య తెలంగాణను నిర్మిస్తే, కాంగ్రెస్ పాలనలో వైద్యరంగం అనారోగ్యానికి గురవుతున్నది. కాంగ్రెస్ ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలతో దవాఖానల్లో సేవలు దాదాపుగా నిలిచిపోయాయి. కేసీఆర్ పాలనలో వైద్యం చేసిన ఆస్పత్రులకు చేతులెత్తి మొక్కెటోళ్లు..కాంగ్రెస్ పుణ్యమా అని తిట్టుకుంటున్నరు.

### భర్తీ చేసేదెప్పుడు..?

హైదరాబాద్ జిల్లా పరిధిలో 91 పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు(యూపీహెచ్‌సీ) ఉన్నాయి. ఒక్కో యూపీహెచ్‌సీ సుమారు 10,000 మందికి వైద్యసేవలందించాలి. జిల్లాలో సుమారు 260 ఏఎన్ఎం సిబ్బంది, 1650 మంది ఆశ కార్యకర్తలు విధులు నిర్వహిస్తుండగా, ప్రస్తుతం ఇటీవల జరిగిన బదిలీల్లో 128 మంది ఏఎన్ఎంలు బదిలీపై ఇతర జిల్లాలకు వెళ్లారు. 128 ఖాళీల్లో కేవలం 25 మందిని కాంట్రాక్ట్ పద్ధతిలో నియమించి ఉన్నవారిపైనే అదనపు పనిభారం మోపుతున్నారు. అంతేకాకుండా జిల్లాలోని పలు ప్రాంతాల్లో మూడు యూపీహెచ్‌సీలకు కలిపి ఒక్కరే మెడికల్ అధికారి ఉంటూ వైద్యసేవలందిస్తుండడం గమనార్హం. ఇంకొందరు మెడికల్ అధికారులు ఉదయం పదకొండు అయినా సెంటర్లకు చేరుకోరు. ఏఎన్ఎంలతోనే సగం చికిత్స చేయిస్తారు. డాక్టర్ల కోసం రోగులు ఎదురు చూసి చేసేదేమీ లేక ఇండ్లకు వెనుతిరుగుతున్నారు.

### సర్వీస్ సెంటర్ల పురోగతేమిటి..?

బస్తీవాసులు, పేదలకు సాధారణ ప్రసవాలు, 24 గంటలు వైద్యసేవలు అందుబాటులో ఉండేలా కేసీఆర్ సర్కారు జిల్లాలోని 9 సర్వీస్ సెంటర్లను ఏర్పాటు చేసింది. ఇందులో ప్రసవాలకు కావాల్సిన పరికరాలు, ల్యాబ్‌లను ఏర్పాటు చేసింది. జిల్లాలోని బోరబండ, పురానాపూల్-1, యాకుత్‌పురా-1, దారుల్‌షిఫా, చార్మినార్, డాక్టర్ పాల్ దాస్, గగన్‌మహల్, బేగంపేట ప్రాంతాల్లోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఏర్పాటు చేసిన సర్వీస్ సెంటర్లలో గతంలో ప్రసవాలు అనుకున్న స్థాయిలో జరిగేవి. పేదలకు వరంగా మారిన కేసీఆర్ కిట్ ప్రభుత్వ వైద్య సేవలను గుండెలకద్దుకునేలా చేసింది. ఆ ప్రభావంతో ఆశ వర్కర్లు నెలలో ఆరు వరకు ప్రసవాల కేసులు నమోదు చేయించి కేసీఆర్ కిట్లను అందించేవారు. కాంగ్రెస్ రాకతో కేసీఆర్ కిట్‌ను ఎంసీహెచ్ కిట్‌గా మార్చారు. అధికారంలోకి వచ్చిన నాటినుంచి నేటి వరకు ఎంసీహెచ్ కిట్లు ఇవ్వకపోగా, ప్రసవాలు కూడా తగ్గడం గమనార్హం. సర్వీస్ సెంటర్ల లక్ష్యానికి తూట్లుపొడిచే దిశగా ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తున్నది. గతంలో మాదిరిగానే నెలలో డెలివరీల నమోదు టార్గెట్ ప్రకారం చేయాలని మెడికల్ అధికారులు ఆశ వర్కర్లకు ఆదేశాలు జారీ చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో మాత్రం వారికి చేదు అనుభవమే ఎదురవుతున్నది. ఎంసీహెచ్ కిట్ లేకపోవడంతో సర్వీస్ సెంటర్లకు వచ్చేందుకు బాధితులు అయిష్టంగా ఉన్నారు.

నమస్తే తెలంగాణ
వికారాబాద్
I | హైదరాబాద్, బుధవారం 9 ఏప్రిల్ 2025 | VIKARABAD

# పోయిందంటే ఇక రాలే..

**బండ్లగూడలో మొదలైన కరెంట్ కష్టాలు**

బండ్లగూడ, ఏప్రిల్ 8 : బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో కరెంట్ కష్టాలు మొదలయ్యాయి. చిన్నపాటి గాలి దుమారానికే కరెంట్ ఉండడం లేదు. దీంతో ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. కరెంటు కోసం అధికారులకు ఫోన్ చేసినా స్పందించకపోవడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సోమవారం రాత్రి 9 గంటల సమయంలో వచ్చిన గాలి దుమారానికి పలు ప్రాంతాల్లో వైర్లు తెగిపడడంతో స్థానికులు రాత్రంతా జాగారం చేస్తూ రోడ్లపైకి వచ్చారు. కిస్మత్‌పూర్‌లో ఓ బిల్డర్ పెద్ద ఎత్తున నిర్మాణాలు చేపట్టడంతో మెయిన్ విద్యుత్తు లైన్ ఆ నిర్మాణానికి తగిని విద్యుత్తు సరఫరా నిలిచిపోయిందని స్థానికులు తెలిపారు.



బండ్లగూడలో కరెంట్ కోసం రోడ్డుపై వేచి చూస్తున్న స్థానికులు

## రజతోత్సవ సభకు భారీగా తరలివెళ్లి సక్సెస్ చేద్దాం

# వరంగల్ సభతో వణుకు పుట్టిద్దాం


- మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి
- శంషాబాద్ పట్టణంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో సన్నాహక సమావేశం
- హాజరైన పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, రాష్ట్ర నాయకుడు కార్తీక్‌రెడ్డి తదితరులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి, చిత్రంలో పక్కన బీఆర్ఎస్ పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కార్తీక్‌రెడ్డి తదితరులు

రంగారెడ్డి, ఏప్రిల్ 8 (నమస్తే తెలంగాణ) : బీఆర్ఎస్ ఏర్పడి 25 వసంతాలు పూర్తి కావస్తున్న సందర్భంగా రజతోత్సవ సన్నాహక సమావేశాలు నియోజకవర్గాల వారీగా ముమ్మరంగా సాగుతున్నాయి. అందులో భాగంగానే మంగళవారం శంషాబాద్ పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సన్నాహక సమావేశానికి మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి హాజరై మాట్లాడుతూ.. వరంగల్ సభకు భారీగా తరలివెళ్లి రాష్ట్ర ప్రభుత్వానికి వణుకు పుట్టిద్దామని పిలుపునిచ్చారు. కేసీఆర్ అంటే వ్యక్తి కాదని..ఓ శక్తి అని ఆయన లేకపోతే తెలంగాణ రాష్ట్రం ఏర్పడేదే కాదని స్పష్టం చేశారు. యావత్తు రాష్ట్రాన్ని, మేధావులను ఏకతాటిపైకి తీసుకొచ్చి రాష్ట్రాన్ని సాధించారని కొనియాడారు. కేసీఆర్ పదేండ్ల పాలనలో రాష్ట్రం సుభిక్షంగా ఉండి అన్ని వర్గాల ప్రజలకు అండగా నిలిచిందన్నారు. అలవికాని హామీలు, మోసపూరిత ప్రకటనలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్రాన్ని చిన్నాభిన్నం చేస్తున్నదని.. అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి తెలంగాణను ఆగమాగం చేస్తున్నారని ధ్వజమెత్తారు. రేవంత్ సర్కార్ కంటే బీఆర్ఎస్ పాలనే బాగున్నదని .. మళ్లీ కేసీఆరే సీఎం కావాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. ఈనెల 27న వరంగల్‌లో జరుగనున్న రజతోత్సవ సభకు జిల్లా నుంచి ప్రజలు, ప్రజాప్రతినిధులు, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, కౌన్సిలర్లు, మున్సిపల్ చైర్మన్లు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆమె పిలుపునిచ్చారు. వరంగల్ సభకు జిల్లా నుంచి అన్ని వర్గాల వారు అధిక సంఖ్యలో తరలివెళ్లి సక్సెస్ చేయాలని బీఆర్ఎస్ పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. అనంతరం ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ.. వరంగల్‌లో జరుగనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభతో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరుబాట ఆరంభం అవుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కార్తీక్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. కాగా, ఈ మీటింగ్‌లో నవాబు పేట మండలంలోని నారేగూడెం, పులుమామిడి గ్రామాలకు చెందిన వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు దాదాపుగా 15 మంది మాజీ మంత్రి సబితారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు.

బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేస్తున్న మంచిరెడ్డి కిషన్‌రెడ్డి



# మైదానాలుగా పార్కులు



మొక్కలు లేక మైదానంగా మారిన మైత్రినగర్‌లోని పార్కు

- పార్కులపై పాలకులు, అధికారులకు కొరవడిన పట్టింపు
- మైత్రినగర్‌లోని పార్కులో కనిపించని మొక్కలు
- తిరుమల వెంచర్‌లోని పార్కులో ఎండిపోయిన మొక్కలు
- గాన్‌సలో పాఠశాల సమీపంలోని పార్కులో పెరిగిన పిచ్చిమొక్కలు
- గత బీఆర్ఎస్ హయాంలో పచ్చని మొక్కలతో అలరారిన పార్కులు

పరిగి, ఏప్రిల్ 8 : కాంక్రీట్ జంగల్‌గా మారుతున్న పట్టణాల్లో ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొల్పడంతోపాటు స్వచ్ఛమైన గాలి కోసం గత బీఆర్ఎస్ ప్రభుత్వం పార్కుల అభివృద్ధికి శ్రీకారం చుట్టగా.. నేడు అవి పూర్తిగా నిర్లక్ష్యానికి గురవుతున్నాయి. కనీసం వాటిని ఎవరూ పట్టించుకోవడం లేదు. ఉన్న కొద్దిపాటి మొక్కలకు కూడా నీరు పోసేవారు కరువయ్యారు. పార్కు ప్రహరీలు కూలినా పట్టించుకునే వారే లేరు. గత కేసీఆర్ ప్రభుత్వం పరిగి పట్టణంలోని కొత్త లేఅవుట్లలో మున్సిపాలిటీకి వదిలిన పార్కు స్థలాల్లో పలు రకాల మొక్కలను నాటి పచ్చదనాన్ని పెంపొందించింది. మధ్యలో కూర్చొని సేద తీరేందుకు సిమెంట్ బెంచీలనూ ఏర్పాటు చేయించింది. ప్రత్యేకంగా ట్యాంకర్లతో నీరు పోయించడంతో అప్పట్లో పార్కులు పచ్చదనంతో కనిపించేవి. అయితే, ప్రభుత్వం మారడంతో ఆ పరిస్థితి కూడా మారింది. పరిగి పట్టణంలోని పార్కులను ఎవరూ పట్టించుకోవడం లేదు. మైత్రినగర్‌లో ఏర్పాటుచేసిన పార్కులో రెండు పర్యాయాలు మొక్కలు నాటినా అవి కనిపించడం లేదు. అదేవిధంగా తిరుమల వెంచర్‌లో ఉన్న పార్కులోని మొక్కలన్నీ ఎండిపోయాయి. పార్కుగోడ కూలిపోయినా పట్టించుకునే వారే లేరు. ఆ ఖాళీ స్థలంలో పైపుల చుట్టలు వేశారు. గాన్‌సలో పాఠశాల సమీపంలోని పార్కులో పెరిగిన పిచ్చిమొక్కలను తొలగించకపోవడంతో లోపలికి వెళ్లి వాకింగ్ చేయలేని పరిస్థితి ఏర్పడింది. మున్సిపాలిటీలో వాటర్ ట్యాంకర్ ఉన్నా మొక్కలకు నీరు పోసేందుకు వినియోగించకపోవడం గమనార్హం. అసలు అధికారులకు పార్కుల సంరక్షణ ఆలోచన లేదనే విమర్శలున్నాయి. పాలకవర్గ కాలపరిమితి పూర్తి కావడంతో అదనపు కలెక్టర్ ఇక్కడ ప్రత్యేకాధికారిగా కొనసాగుతున్నారు. పచ్చదనం కోసం ఏర్పాటు చేసిన పార్కులు ఖాళీ మైదానాలుగా మారుతున్నాయని పలువురు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకుని పార్కులను పచ్చదనానికి నిలయాలుగా తీర్చిదిద్దాలని కోరుతున్నారు.



కూలిపోయిన తిరుమల వెంచర్‌లో ఉన్న పార్కు గోడ



కొరవడిన అధికారుల పర్యవేక్షణతో గాన్‌సలోని పాఠశాల సమీపంలో ఉన్న పార్కులో మొలిచిన పిచ్చిమొక్కలు

# ఉరే సరి..

**ఎన్ఐఏ కోర్టు తీర్పును సమర్థించిన హైకోర్టు**

**బాధిత కుటుంబాల హర్షం**

సిటీబ్యూరో, ఏప్రిల్ 8 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ దిల్‌సుఖ్‌నగర్ పేలుళ్ల కేసులో ఎన్ఐఏ కోర్టు తీర్పును సమర్థిస్తూ ఐదుగురు దోషులకు తెలంగాణ హైకోర్టు ఉరిశిక్షను ఖరారు చేసింది. బాంబు పేలుళ్ల కేసులో దోషుల పిటిషన్‌ను న్యాయస్థానం డిస్మిస్ చేసింది. ప్రధాన నిందితుడు రియాజ్ బత్కల్ పరారీలో ఉండగా, మిగతా అహ్మద్ సిద్ధిబప్ప జరార్ అలియాస్ యాసిన్ బత్కల్, అబ్దుల్లా అక్తర్ అలియాస్ హద్ది, తహసీన్ అక్తర్, జియాఉర్‌రెహమాన్, అజిజ్‌షేక్ అనే ఐదుగురు నిందితులకు 2016లో ఎన్ఐఏ ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఉరిశిక్షను విధించింది. ఎన్ఐఏ కోర్టు తీర్పును రద్దు చేయాలని నిందితులు హైకోర్టుకు అప్పీల్‌కు వెళ్లారు. వాదనల తర్వాత మంగళవారం ఆ ఐదుగురు నిందితులు చేసిన అప్పీళ్లను తిరస్కరిస్తూ.. ఎన్ఐఏ కోర్టు తీర్పును హైకోర్టు సమర్థించింది. ఈ తీర్పు నేపథ్యంలో పేలుళ్ల ఘటనలో మృతులు, బాధితుల కుటుంబాలతోపాటు నగర ప్రజలు కూడా హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎన్ఐఏ కోర్టు ఇచ్చిన తీర్పు కచ్చితంగా తమకు కొద్దిపాటి ఉపశమనం ఇచ్చినా తిరిగి నిందితులు హైకోర్టును ఆశ్రయించడంతో తీర్పుపై ఉత్కంఠ ఉండేదని, హైకోర్టు కూడా నిందితుల అప్పీల్‌ను డిస్మిస్ చేసి అదే శిక్షను సమర్థించడం తమకు ఆనందంగా ఉందని బాధిత కుటుంబాలు చెప్పాయి.

### అసలేం జరిగింది..!

దిల్‌సుఖ్‌నగర్‌లో 2013 ఫిబ్రవరి 21న మొదటి పేలుడు రాత్రి 7గంటల సమయంలో మలక్‌పేట పీఎస్ పరిధిలోకి వచ్చే 107 నంబర్ బస్టాప్ వద్ద జరిగింది. కొద్ది క్షణాల వ్యవధిలోనే కోణార్క్ థియేటర్ సమీపంలోని ఏ 1 మిర్చి సెంటర్ వద్ద రెండో పేలుడు సంభవించింది. ఈ పేలుళ్ల ధాటికి మొత్తం 18 మంది మృత్యువాత పడగా, 131 మంది గాయపడ్డారు. ఈ పేలుడుపై సరూర్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేసి అప్పట్లో దర్యాప్తు ప్రారంభించారు. ఈ పేలుళ్ల ఘటనపై తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేయాలని భావించినా, కేంద్ర ప్రభుత్వం నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ (జాతీయ దర్యాప్తు సంస్థ)ను రంగంలోకి దించింది. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లో నమోదైన రెండు కేసులు ఎన్ఐఏకి బదిలీ అయ్యాయి. దర్యాప్తు ప్రారంభించిన ఎన్ఐఏ ఈ పేలుళ్లకు పాల్పడింది ఇండియన్ ముజాహిదీన్ ఉగ్రవాద సంస్థగా గుర్తించింది. దర్యాప్తులో భాగంగా అహ్మద్ సిద్ధిబప్ప జరార్ అలియాస్ యాసిన్ బత్కల్, అబ్దుల్లా అక్తర్ అలియాస్ హద్ది, తహసీన్ అక్తర్, జియాఉర్‌రెహమాన్, అజిజ్‌షేక్ అనే ఐదుగురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. పేలుళ్లకు కీలకసూత్రధారి అయిన మహ్మద్ రియాజ్ అలియాస్ రియాజ్ బక్తల్ ఇప్పటికీ పాకిస్తాన్‌లో తలదాచుకున్నట్లుగా ఎన్ఐఏ గుర్తించి అతడిపై రెడ్‌కార్నర్ నోటీసు జారీ చేసింది. ఈ ఐదుగురు నిందితులను దోషులుగా గుర్తించిన ఎన్ఐఏ కోర్టు 2016 డిసెంబర్ 19న వారికి జైలుశిక్ష, జరిమానాలతో పాటు ఉరిశిక్ష విధించింది. కాగా ఎన్ఐఏ కోర్టు తీర్పుపై నిందితులు అదే ఏడాది తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. మంగళవారం హైకోర్టు నిందితుల అప్పీల్‌ను డిస్మిస్ చేస్తూ ఎన్ఐఏ కోర్టు ఇచ్చిన తీర్పును సమర్థించింది.